సాక్షి అనకాపల్లి

మంగళవారం, 10, అక్టోబర్, 2023



అర్హులు, అనర్హులను గుర్తించాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్, జేసీ తదితరులు 467 అర్జీలు స్వీకరించారు. 8లో



జాతీయ స్థాయి మారథాన్‌కు ఎంపిక

సబ్బవరం: అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల జాతీయ స్థాయి మారథాన్‌కు సబ్బవరం ప్రతిభా విద్యాలయ విద్యార్థులు ఎంపికయ్యారు.



ప్లాస్టిక్ నిషేధమే తరుణోపాయం

ఏయూ క్యాంపస్: ఏయూలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై శిక్షణ తరగతులను ఏయూ రెక్టార్ కె.సమత ప్రారంభించారు.

న్యూస్‌రీల్

మినీ జాబ్ మేళా రేపు

అనకాపల్లిటౌన్: నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 24 ఏళ్లలోపు వయసున్న ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 నంబరును సంప్రదించాలని కోరారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



పతకం అందుకుంటున్న ఉపాధ్యాయుడు డేవిడ్

కోటవురట్ల: అథ్లెటిక్స్‌లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సత్తా చాటుతున్నారు. విశాఖలోని పోలీసు బ్యారెక్స్‌లో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. కోటవురట్లకు చెందిన ఉపాధ్యాయుడు పి.డేవిడ్ పలు విభాగాలలో సత్తా చాటారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ అథ్లెటిక్స్‌లో 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించారు. డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు డేవిడ్ తెలిపారు. సహచర ఉపాధ్యాయులు డేవిడ్‌కు అభినందనలు తెలిపారు.

ఇంటర్ సర్టిఫికెట్లు సిద్ధం



విద్యార్థికి ఒరిజినల్ సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాధిక, వృత్తి విద్యాశాఖాధికారి సుజాత

అనకాపల్లి టౌన్: ఈ ఏడాది మార్చి, మే నెలల్లో ఇంటర్ పరీక్షల్లో పాసైన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల జాబితాలు వచ్చాయని, విద్యార్థులు కళాశాలలకు వెళ్లి తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.రాధిక చెప్పారు. సోమవారం కళాశాల ఆవరణలో విద్యార్థులకు మార్కుల జాబితా అందజేశారు. విద్యార్థి మొబైల్ ఫోన్‌లో డిజి లాకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని కూడా మార్కుల జాబితా సాఫ్ట్‌కాపీ పొందవచ్చని ఆమె చెప్పారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.సుజాత మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు నవంబర్ 30వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచిందని ఆమె తెలిపారు. ఆయా విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులకు హాజరుకావచ్చని ఆమె చెప్పారు.

అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన



విద్యార్థులను ఇంటర్వ్యూలు చేస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాను జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి ప్రారంభించారు. ప్రభుత్వం మేళాల ద్వారా కల్పిస్తున్న అవకాశాలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాంకేతిక విద్యకు మంచి డిమాండ్ ఉందన్నారు. మేళాకు 102 మంది అభ్యర్థులు హాజరు కాగా 35 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మేళాలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో నాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం అనకాపల్లికి చెందిన మళ్ల రామకోటేశ్వరరావు లక్షా 116 రూపాయల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు పీఆర్వో నాయుడు అన్నప్రసాద బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు.

బడి బస్సుతో చదువుకు ప్రోత్సాహం

చదువుకునే పిల్లలపై ఎలాంటి ఒత్తిడి ఉండరాదు. బాగా చదువుకుని మంచి స్థాయికి వెళ్లాలి. తమ కుటుంబానికి ఆసరాగా నిలవాలి. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కారాదు. రోజూ బడికి వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు పడరాదు. అందుకే ప్రభుత్వం బడి బస్సులను ఏర్పాటు చేసింది. రోజూ ఉదయం, సాయంత్రం స్కూల్‌కు తీసుకెళ్లి, తిరిగి ఇంటి వద్ద దించుతూ తల్లిదండ్రులకు, విద్యార్థులకు టెన్షన్ తప్పించింది.



బడిబస్సు ఎక్కుతున్న విద్యార్థులు

డిపోల వారీగా బస్ పాసులు

డిపో	ఉచిత పాసులు	రాయితీ పాసులు
నర్సీపట్నం	3637	4862
అనకాపల్లి	2040	7283
గ్రేటర్ విశాఖ	--	829

కోటవురట్ల: ఒత్తిడిలేని, కార్పొరేట్ స్థాయి విద్య కోసం సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం నిరంతరం తపిస్తోంది. ఆ ఆలోచనల్లో నుంచి ఉద్భవించినవే అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక తదితర పథకాలు. మనబడి నాడు–నేడుతో కార్పొరేట్ స్థాయి వసతుల్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం, విద్యార్థుల కోసం మరో అడుగు ముందుకేసింది. పిల్లలు దూర ప్రాంతాల బడికి వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా బడి బస్సుకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు.

బడికెళ్లే పిల్లలకు ఉచిత బస్సు ప్రయాణం

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి చదివే బాలికలు, 7వ తరగతి వరకు బాలురకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఇందుకు సంబంధించి ఆర్టీసీ డిపోలలో పూర్తి ఉచితంగా బస్ పాసులు అందిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు ఆయా రూట్లలో సమయానికి బస్సు సర్వీసులు లేకపోతే బడి బస్సు పేరుతో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. పాసులు ఉన్న విద్యార్థులను సమయానికి బడికి తీసుకెళుతూ తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పిస్తున్నారు. 8వ తరగతి నుంచి పై తరగతులు చదివే బాలురకు, ఉన్నత విద్యకు వెళ్లే బాలికలకు రాయితీపై బస్ పాసులు అందించి ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు.

5,677 ఉచిత, 13,014 రాయితీ పాసులు

అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, అనకాపల్లి ఆర్టీసీ డిపోల పరిధిలో 5,677 మంది విద్యార్థులకు ఉచిత బస్ పాసులు మంజూరు చేశారు. ఈ రెండు డిపోల పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి బడి బస్సు సర్వీసులతో విద్యార్థులు 20 కిలోమీటర్ల వరకు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఇందుకోసం విద్యార్థి ఫొటోతో పాటు పాఠశాల యాజమాన్యం ధ్రువీకరణ పత్రాలు అందించాల్సి ఉంటుంది. ఉచిత పాసులు కాకుండా 13,014 మంది విద్యార్థులకు రాయితీ పాసులు మంజూరు చేశారు. రాయితీ పాసులు ఉన్న విద్యార్థులు తాము నివసించే ప్రాంతం నుంచి 50 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. విద్యార్థి ఏ రూట్‌లో ప్రయాణించేది వివరాలు పాసులో నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

గతంలో ఇబ్బంది పడేవాళ్లం



మా ఊరు నుంచి నర్సీపట్నం వెళ్లాలంటే 20 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఇది వరకు బడికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఆటోలు ఉండేవి కావు. నాన్న ప్రత్యేకంగా బైక్‌పై నర్సీపట్నం తీసుకెళ్లి స్కూల్ వద్ద దింపేవారు. జగన్ మామయ్య దయవల్ల బడిబస్సు వస్తోంది. నాకు బస్ పాసు కూడా ఇచ్చారు. ఇపుడు ఏ ఇబ్బంది లేకుండా బస్సులో వెళ్లి వస్తున్నా.

– కన్నంరెడ్డి భాగ్యశ్రీ, 9వ తరగతి, నీలిగుంట, కోటవురట్ల

ఆడపిల్లలకు రక్షణ



బడి బస్సు వల్ల ముఖ్యంగా ఆడపిల్లలకు రక్షణ ఉంటోంది. ఎలాంటి భయం లేకుండా బస్సులో వెళ్లి, బస్సులో తిరిగి ఇంటికొస్తున్నాం. పాఠశాల సమయాలలో ఉచిత, రాయితీ బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఆకతాయిల వల్ల ఇబ్బంది పడతానేమోనన్న టెన్షన్ అమ్మానాన్నలకు టెన్షన్ లేదు. థాంక్యూ సీఎం సార్.

– కన్నంరెడ్డి సాయికుమారి, డిగ్రీ మొదటి సంవత్సరం

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థుల ప్రయోజనం కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోంది. ఉచిత బస్ పాసులను అందిస్తోంది. బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగి, ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి. అప్పుడే ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలకు సార్థకత వస్తుంది. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.పద్మావతి, జిల్లా ప్రజా రవాణా అధికారి, అనకాపల్లి జిల్లా

ఏలేరు–తాండవ అనుసంధానానికి భూ సేకరణ

- ఏలేశ్వరం ప్రాజెక్టు అధికారులకు ప్రతిపాదనలు



తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ఏలేరు–తాండవ ప్రాజెక్టుల అనుసంధానానికి 25 ఎకరాల భూమి అవసరమని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏలేరు రిజర్వాయరు నుంచి తాండవ ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా తరలించేందుకు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నాతవరం మండలంలో ఏలేరు కాలువపై మూడు చోట్ల ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి, పెదగొలుగొండపేట వద్ద నుంచి తాండవ రిజర్వాయరులోకి నీటిని తరలించేందుకు పైపులైను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అవసరమైన భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల ప్రతిపాదనల మేరకు 25 ఎకరాలు రైతుల నుంచి భూమిని సేకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏలేరు కాలువలో నుంచి తాండవ రిజర్వాయరులోకి పైపులైను ద్వారా నీటిని తరలించేందుకు 11 ఎకరాలకుపైగా భూమి అవసరం ఉంటుందన్నారు. మిగతా రెండు చోట్ల ఏర్పాటు చేసే ఎత్తిపోతల పథకాలకు 14 ఎకరాలు అవసరం కానుందన్నారు. భూ సేకరణకు రూ.4 కోట్లకు పైగా ఖర్చవుతుందన్నారు. దీనికి సంబంధించి నిబంధనల మేరకు భూసేకరణకు అవసరమైన రికార్డులను ఏలేశ్వరం ప్రాజెక్టు అధికారులకు పంపించామన్నారు.

● సమరోత్సాహం

విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి, అరకు ఎంపీలు డాక్టర్ బి.వి.సత్యవతి, బొడ్డేటి మాధవి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, సృజనాత్మక, సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ జోగినాయుడు, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతి రాణి









వినాయకుని ఆకారంలో దీపాలంకరణ

● ఆధ్యాత్మిక వెలుగులు

స్థానిక నాయుడు వీధిలో వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన దీపారాధన భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకుంది. వినాయక మహోత్సవాల్లో భాగంగా నాయుడు వీధి లక్కీ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపారాధనలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, గ్రామ మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో దీపాలంకరణ చేశారు. శివలింగం, వినాయకుని ప్రతిరూపం, త్రిశూలం, ఓంకారం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– దేవరాపల్లి

సీఎం విశాఖ పర్యటనకు ఏర్పాట్లు



ఇన్ఫోసిస్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ (విశాఖ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీని ప్రారంభించనున్న దృష్ట్యా రుషికొండ ఐటీ సెజ్ ప్రాంతాల్లో ఇన్ఫోసిస్, జీవీఎంసీ అధికారులతో పర్యటించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభం చేసే ప్రాంగణం, స్టేజీతో పాటు హెలిప్యాడ్ తదితర ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, విద్యుత్, రోడ్ల పరిశుభ్రత, రోడ్డు ప్యాచ్‌వర్క్స్, గ్రీనరీ తదితర పనులు త్వరితగతిన చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు.

ఆయనతో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికాధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజనీర్ శ్యాంసన్‌రాజు, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎన్.కిశోర్, కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతిరాజు, డీఈ వంశీ ఉన్నారు.

ఓపీ.. ‘అభా’తో హ్యాపీ

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆన్‌లైన్ ఓపీ
- అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు
- క్యూల్లో వేచి ఉండక్కర్లేదు.. సమయం ఆదా.!

మహారాణిపేట: ప్రస్తుత డిజిటల్ యుగంలో అగ్గిపెట్టె నుంచి ఆడి కారు కొనుగోలు వరకూ ఆర్థిక లావాదేవీలు మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. చిన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అవతలి వ్యక్తి ఖాతాలోకి డబ్బులు పంపుతున్నారు. ఇదే తరహాలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా అవుట్ పేషెంట్(ఓపీ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్‌కు టోకెన్ పొందే వెసులుబాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి వచ్చింది. డిజిటలైజేషన్‌లో భాగంగా అభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్‌లో రోగి వివరాలను నమోదు చేసి వైద్యం పొందే సేవలు ఇటీవల కేజీహెచ్, ఈఎన్‌టీ, ఛాతీ తదితర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రారంభమయ్యాయి.

ఏమిటి లాభం?

దేశవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు పొందే రోగుల వివరాలను ‘నేషనల్ హెల్త్ రికార్డ్స్’లో పొందుపరిచేందుకు ఆన్‌లైన్ అవుట్ పేషెంట్(ఓపీ) విధానాన్ని విస్తరిస్తున్నారు. క్యూలో వేచి ఉండే సమయాన్ని ఈ విధానం ద్వారా ఆదా చేసుకోవచ్చు. సాధారణంగా ఎవరైనా వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే తొలుత ఓపీ కౌంటర్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. రోగి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఇతర వ్యక్తిగత వివరాలను వెల్లడించాలి. అనంతరం సంబంధిత విభాగానికి రోగికి ఓపీ టికెట్ ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేందుకు కనీసం 5 నుంచి 10 నిమిషాలు పడుతుంది. పెద్దాస్పత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోగులు గంటల తరబడి క్యూలో నిల్చొని పడిగాపులు పడాల్సి వస్తుంది. అదే క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు నేరుగా వెళ్లి టోకెన్ తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు.

ఇదీ నమోదు విధానం

- స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్‌కు వెళ్లి.. ఏబీహెచ్‌ఏ(అభా) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆయుష్మాన్ డిజిటల్ హెల్త్ అకౌంట్(అభా) 14 అంకెల గుర్తింపు/ఫోన్ నంబర్/మెయిల్ ఐడీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ అవ్వాలి.
- యాప్‌లోకి లాగిన్ అయిన వెంటనే అభా వివరాలు ప్రత్యక్షం అవుతాయి. వీటిని ఆస్పత్రితో షేర్ చేసే ఆప్షన్ కనిపిస్తుంది. షేర్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే టోకెన్ నంబర్ వస్తుంది. ఈ టోకెన్ 30 నిమిషాల పాటు వ్యాలిడిటీలో ఉంటుంది.
- టోకెన్ నంబర్ వచ్చాక ఆస్పత్రిలో కౌంటర్‌కు వెళ్లి అభా గుర్తింపు నంబర్, ఫోన్ నెంబర్ తెలియజేసి ఏ స్పెషాలిటీలో ఓపీ అవసరమో చెబితే వైద్య సిబ్బంది చీటీ ఇస్తారు. దీన్ని తీసుకుని నేరుగా డాక్టర్‌ను సంప్రదించవచ్చు. సాంకేతిక సమస్య లేకపోతే ఇదంతా రెండు నిమిషాల్లోనే అయిపోతుంది. ఒక వేళ నెట్‌వర్క్ సమస్య ఉంటే కొంత టైమ్ పడుతుంది.
- ఆస్పత్రికి వెళ్లే ముందే ఇంటి వద్ద అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. ఓపీ కౌంటర్ వద్ద పని సులువవుతుంది. ఒకసారి యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు.
- ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు ఓపీ కౌంటర్ల వద్ద వైద్య సిబ్బంది ఉంటారు.
- ప్రస్తుతం పాత పద్ధతిలో ఓపీ చీటీలు ఇస్తూనే.. సమాంతరంగా అభా విధానాన్ని అమలు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ లేని వారు సిబ్బందిని సంప్రదిస్తే ఓపీ చీటీ ఇస్తున్నారు.



ఓపీ విభాగంలో లోపల కౌంటర్లు (ఇన్‌సెట్) కేజీహెచ్‌లో ఓపీ కౌంటర్లు

కేజీహెచ్‌లో ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో ఓపీ చీటీల జారీకి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. కేజీహెచ్‌లో సోమవారం, బుధవారం, గురువారాల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మొత్తం ఏడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని కౌంటర్లు పనిచేస్తాయి. ఈ కౌంటర్లలో ప్రతి రోజూ 1,400 నుంచి 1,500 ఓపీ చీటీలు, 200 నుంచి 300 వరకు ఇన్ పేషంట్ల కోసం కేసు షీట్లను జారీ చేస్తున్నారు. ఇక్కడ ఆన్‌లైన్ ఓపీ చీటీల జారీలో చిన్నపాటి సమస్యలు తలెత్తుతున్నాయి. నెట్‌వర్క్ సమస్య ఉంది. ఈ విధానంపై అవగాహన లేని వారు అక్కడే ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదిస్తే.. వారు తగిన సూచనలిస్తారు. అభా యాప్ లేకపోయినా పాత పద్ధతిలో ఓపీ చీటీలు పొందవచ్చు.

‘అభా’తో రోగికి సమయం ఆదా



అభా యాప్ వల్ల రోగికి సమయం ఆదా అవుతుంది. ఒకసారి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు. ఈ యాప్‌పై రోగులకు అవగాహన కల్పించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో రోగి పేరు నమోదు వల్ల రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఆశ, ఏఎన్‌ఎంలను సంప్రదించినా అభాలో పేర్లు నమోదు చేస్తారు.

– డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 53 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 53 అర్జీలు వచ్చాయి. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటూ, దిగువస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర అంశాలపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్టు ఎస్పీ చెప్పారు. అర్జీలు నిర్ధిత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

రేపు ఎస్.రాయవరంలో 'జగనన్నకు చెబుదాం'

ఎస్.రాయవరం : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదా కార్యక్రమం జిల్లా కలెక్టర్ రవిపతాన్‌శెట్టి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు కలెక్టర్ నేరుగా హాజరై జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

29న భీమవరంలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

అనకాపల్లి టౌన్ : ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలు ఈనెల 29న ఏపీ బిడీబిల్డింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం శ్రీ కృష్ణ దేవరాయ కల్యాణమండపంలో (బ్యాంకు కాలనీ) జరుగుతాయని జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నేస్ అసోసియేషన్ కార్యదర్శి శిలపరశెట్టి బాబి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే బాడీబిల్డర్స్ తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహంతో షీల్డ్ అందజేస్తారని తెలిపారు. ఓవర్ ఆల్ ఛాంపియన్‌కు రూ.25వేలు నగదు బహుమతి ఉంటుందన్నారు. వివరాలకు 84650 77799 నంబరును సంప్రదించాలని కోరారు.

సంక్షేమ పథకాల్లో అర్హులు, అనర్హులను గుర్తించాలి

- ఫిర్యాదులపై సరిగా స్పందించాలి
- స్పందనలో అధికారులకు కలెక్టర్ సూచన

తుమ్మపాల : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే సంక్షేమ పథకాలు అర్జీలను తక్షణమే విచారణ చేపట్టి అర్హులకు సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా సంక్షేమ పథకాలు కోసం చేసుకున్న దరఖాస్తుల్లో అర్హులు, అనర్హులను గుర్తించాలన్నారు. అనర్హులకు వారికి పథకాలు కొరతకు గల కారణాలను క్షుణ్ణంగా తెలపాలని, అలాగే అర్హుల వివరాలను ఆయా పథకాలు జాబితాలో చేర్చాలని సూచించారు. అర్జీలపై సమాధానాలు వివరంగా ఇవ్వాలన్నారు. ఫిర్యాదులపై విచారణ చేయకుండా నామమాత్రపు సమాధానాలు చేస్తున్న అంశాలపై కలెక్టరేట్‌లో ప్రత్యేక కాల్‌సెంటర్ ద్వారా ఫిర్యాదుదారుడికి కాల్ చేసి తెలుసుకోవడం జరుగుతుందని, పరిష్కారం కాని ఫిర్యాదులను రీఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. మొత్తం 467 అర్జీలు నమోదు కాగా అధిక సంఖ్యలో రెవెన్యూ సంబంధిత అర్జీలు, ఫిర్యాదులు అందినట్టు డీఆర్వో బి.దయానిధి తెలిపారు. స్పందన వేదికలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి, జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

జగనన్న ఇచ్చిన ఇంటి స్థలం అమ్మేసారు.....

జగనన్న ఇచ్చిన ఇంటి స్థలాన్ని తనకు తెలియకుండా వీఆర్వో అమ్మేసారని అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన దుడ నూకమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తుమ్మపాల గ్రామంలో జీవిస్తున్న తనకు సొంతిల్లు లేకపోవడంతో జగనన్న లేఅవుట్‌లో తన పేరున ఇంటిపట్టా మంజూరు చేసారని, ఇంటిపట్టా తన వద్దనే ఉందని, అయితే తనకు కేటాయించిన స్థలాన్ని మాత్రం తనకు తెలియకుండా గ్రామ వీఆర్వో, కొందరు గ్రామస్తులతో కలిసి ఇతరులకు అమ్మేసారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. గత వారం కూడా స్పందనలో ఫిర్యాదు చేశానని, కానీ ఎవరూ పట్టించుకోలేదని, తనకు న్యాయం చేయాలని కోరింది.

తుప్పలు తొలగించాలి

అనకాపల్లి పట్టణ పరిధిలో శారదానది, శంకరం వైపు గల రైల్వే బ్రిడ్జిలపై పేరుకుపోయిన తుప్పలను తక్షణమే తొలగించి ప్రజల రాకపోకలకు రోడ్డును శుభ్రం చేయాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు స్పందనలో వినతి అందించారు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్లే వంతెనలపై తుప్పలు పెరిగి రోడ్లపైకి వచ్చేశాయని, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ


విజేతలకు బహుమతి ప్రదానం

కశింకోట: జిల్లా స్థాయి క్విజ్ పోటీలో కశింకోట డీపీఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు ప్రథమ బహుమతి లభించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యా శాఖ సంయుక్తంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు సోమవారం అనకాపల్లిలో నిర్వహించిన పోటీలో కె.దిలీప్, జి.బాలగోపాల్ ప్రథమ స్థానం పొందారు. వీరికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎ.హేమంత్, అదనపు వైద్యాధికారి బాలాజీ చేతుల మీదుగా రూ.5 వేల నగదు బహుమతి, ప్రతిభా ధ్రువ పత్రాలు అందజేశారు. వీరిని హెచ్ఎం ఎం.ఆర్.వి.అప్పారావు, తెలుగు ఉపాధ్యాయుడు ఇ.రామారావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఈకేవైసీకి నేడే తుది గడువు

- ఇప్పటివరకు 77 శాతం పూర్తి
- 1.85 లక్షల ఎకరాలు ఆన్‌లైన్‌లోనమోదు
- 1.29 లక్షల మంది రైతులకు బయోమెట్రిక్

నక్కపల్లి : అన్నదాతకు అండగా జగనన్న ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలకు, ఈకేవైసీ తప్పనిసరి అని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఈకేవైసీ చేయించుకునేందుకు ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, మంగళవారం లోగా రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది కోరుతున్నారు. సోమవారం నాటికి జిల్లాలో ఈ క్రాప్, ఈకేవైసీ ప్రక్రియ 77 శాతం మాత్రమే పూర్తయింది. ఈ క్రాప్ నమోదులో భాగంగా ముందుగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వాటిని వీఆర్వోలు ధ్రువీకరించారు. తర్వాత ఈ కేవైసీ చేపట్టారు. రైతులకు పట్టాదారు పాసు పుస్తకం సర్వే నంబర్లు, వాటిలో సాగు చేస్తున్న పంటల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేశారు. ఈ వివరాలు కూడా ఆన్‌లైన్‌లో వీఏఏ, వీఆర్వోలు ధ్రువీకరించిన తర్వాత బయోమెట్రిక్ (వేలిముద్ర)వేయడంతో ఈకేవైసీ ప్రక్రియ లాంఛనంగా పూర్తయింది. జిల్లాలో వ్యవసాయ పంటలకు సంబంధించి 1.33 లక్షల ఎకరాలు, ఉద్యానవన పంటలకు సంబంధించి 1.17 లక్షల ఎకరాలు మొత్తం 2.50 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. 1.74 లక్షల మంది రైతులున్నారు. వీరిలో 9వ తేదీ నాటికి 1.29 లక్షల మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారు. ఇక 2.50 లక్షల ఎకరాలకు గాను 1.85 లక్షల ఎకరాలకే ఈకేవైసీ (పంటలు ఆన్‌లైన్‌లో) నమోదైంది. అనకాపల్లి జిల్లాలో 24 మండలాల్లోను ఈ ప్రక్రియ జరుగుతోంది. ఈకేవైసి చేయించుకునేందుకు ఈనెల 10వ తేదీ తుది గడువని మండల వ్యవసాయశాఖాధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. ఎరువులు, విత్తనాలు, యాంత్రీకరణ పరికరాలపై రాయితీ, పంటల బీమా వర్తింపు, రైతు భరోసాకు అర్హత కల్పించడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరి అని తెలిపారు.


నక్కపల్లిలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

శ్లాబ్ పలక మీద పడి విద్యార్థి దుర్మరణం

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ
- ఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, డీఈవో
- వేరే భవనంలో తరగతులు నిర్వహించాలని ఆదేశం


ఆస్పత్రి మార్చురీ వద్ద కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి


ప్రసన్నకుమార్ (ఫైల్)

పాయకరావుపేట: పట్టణంలోని దుర్గానగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న బాత్‌రూం శ్లాబ్ పలక జారి పడి సోమవారం విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. ఈ పాఠశాలలో రూ.15 లక్షలతో నాడు నేడు పనులు జరుగుతున్నాయి. పాఠశాల వెనుక భాగంలో విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. శ్లాబ్ వేసి రెండు రూములు నిర్మించారు. పిట్టగోడ కట్టే నిమిత్తం కాంట్రాక్టర్ సిమెంట్ పలక ఏర్పాటు చేశాడు. పలక కిందకు పడిపోకుండా సపోర్టుగా కర్ర పెట్టాడు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న తులసి సిద్దూ ప్రసన్న కుమార్ (9) భోజన విరామ సమయంలో తోటి స్నేహితులతో కలసి నిర్మాణంలో ఉన్న బాత్‌రూం వద్దకు వెళ్లి, సపోర్టుగా ఏర్పాటు చేసిన కర్రను లాగడంతో పలక జారిపడింది. పలక తలకు తగలడంతో తీవ్ర రక్తస్రావమవుతున్న విద్యార్థిని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పాఠశాలలో నాడు నేడు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే సిమెంట్ పలక తన కుమారుడిపై పడి మరణించాడని విద్యార్థి తండ్రి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణంలో ఉన్న భవనాల్లోకి విద్యార్థులు వెళ్లకుండా రక్షణ ఏర్పాటు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లి దండ్రులు కాకినాడకు చెందిన వారు. ఉపాధి కోసం పాయకరావుపేట వలస వచ్చారు. తండ్రి పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మ హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చారు.

ఆస్పత్రి మార్చురీలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని సందర్శించి, విద్యార్థి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాఠశాలలో పనులు పూర్తయ్యేవరకు తరగతులను వేరొక భవనంలో నిర్వహించాలని ఎంఈవో గాంధీని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం పాఠశాలకు సెలవు ప్రకటించారు. అవకాశం ఉన్నంతమేర బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే బాబూరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించామని సీఐ అప్పలరాజు, ఎస్ఐ రమేష్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు 4 జట్ల ఎంపిక


ఎంపిక చేసిన సెపక్‌తక్రా బాలికల క్రీడాకారుల జట్టు

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా తరపున నాలుగు జట్లను ఎంపిక చేశారు. 14 ఏళ్లు, 17 ఏళ్ల లోపు విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి నైపుణ్యం కలిగిన 28 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ జట్లు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనున్నట్టు పీడీ తెలిపారు. పోటీలను ముందుగా విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు ప్రారంభించారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ మలసాల ధనమ్మ, హెచ్ఎం పి. శ్రీనివాసరావు, పీడీ జి.నూకరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ డి. ప్రకాశరావు, కోచ్ విజయకుమార్, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పందన వినతులపై విచారణ


విచారణ చేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

మాకవరపాలెం: జగనన్నకు చెబుదాం (స్పందన) వినతులపై తహసీల్దార్ ప్రసాదరావు విచారణ చేపట్టారు. మండలంలోని ఎస్.జి.ఆర్.పి.అగ్రహారం గ్రామానికి చెందిన 60 మంది రైతులు తమ జిరాయితీ భూములకు సాగు హక్కులు కల్పించాలని శుక్రవారం మాకవరపాలెంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో వినతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తహసీల్దార్ ఆ గ్రామంలో వినతులు ఇచ్చిన వారితో సమావేశమయ్యారు. గతంలో ఈనాం గ్రామంగా ఉండేదని, ప్రస్తుతం జిరాయితీగా నమోదైందని గ్రామస్తులు తెలిపారు. రీసర్వేలో సర్వే చేపట్టి పట్టాలు అందజేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందించి సర్వే నిర్వహించి కలెక్టర్‌కు నివేదిస్తామని, తదుపరి ఆయన ఆదేశాలను అమలు చేస్తామన్నారు. సర్పంచ్ లాలం కాశీవిశ్వనాథ్, సర్వేయర్ శ్రీరామ్మూర్తి, వీఆర్వో కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కత్తిసాము పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలకు ఎంపికైన కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం అప్పారావు

కశింకోట : కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలిక సహా నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలకు సోమవారం ఎంపికయ్యారు. అనకాపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ఎంపిక చేసినట్టు హెచ్ఎం ఎం.ఆర్.వి. అప్పారావు, పీడీ వేదుల ప్రభాకరరావు తెలిపారు. 14 ఏళ్లలోపు విభాగంలో ఎం. శరత్, వై. కోటేశ్వరరావు, జ్యోత్స్న, 17 ఏళ్లలోపు విభాగంలో వై. చందురాజు ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని హెచ్ఎం, పీడీలతో పాటు ఉపాధ్యాయులు ఆచంట రవి, పి.వి.ఆర్ ప్రభాకర్, ప్రసాద్, ఆనంద్, అప్పారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మేరి సుజాత అభినందించారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : ఆయా స్టేషన్లకు చేరుకోవాల్సిన రైళ్లు ఆలస్యంగా చేరుకుంటున్నందున ఆయా స్టేషన్ల నుంచి సోమవారం బయల్దేరాల్సినవి ఆలస్యంగా ప్రారంభమవుతాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ▶ చెన్నైలో సోమవారం రాత్రి 7 గంటలకు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్-హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరింది. ▶ తిరుపతిలో సోమవారం రాత్రి 7.55 గంటలకు బయల్దేరాల్సిన తిరుపతి-సంత్రగచ్చి (22856) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా మధ్య రాత్రి 12.30 గంటలకు బయల్దేరింది. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకోనున్నాయి.

తీరంలో సాగర్ కవాతు


అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయంలో సమావేశమైన పోలీస్, మెరైన్ పోలీస్ అధికారులు

- నేడు, రేపు నిర్వహణ

ఎస్.రాయవరం: తీర ప్రాంతాల్లో చొరబాట్లకు అడ్డుకట్ట వేసేలా సాగర్ కవాతు పేరిట రెండు రోజులపాటు మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. పోలీసులు, మెరైన్ పోలీసులు సంయుక్తంగా పాల్గొనే ఈ కార్యక్రమాన్ని రేవుపోలవరం, బంగారంపాలెం, రాజయ్యపేట, పాల్మన్‌పేట, పాల్తేరు తదితర తీర ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తారు. అడ్డురోడ్డులోని నక్కపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం అధికారులు సమావేశమై బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. పాయకరావుపేట మెరైన్ సీఐ నారీమణి, నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్.రాయవరం ఎస్ఐ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాదిగ సంగ్రామ పాదయాత్ర


మాదిగ మహా సంగ్రామ పాదయాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ సభ్యులు

మాడుగుల: గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న మాదిగ మహా సంగ్రామ పాదయాత్ర విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 ఏళ్లుగా ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా కేంద్ర ప్రభుత్వం మాదిగలను చిన్నచూపు చూస్తోందన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కళాకారులకు అందించే గుర్తింపు కార్డులకు దరఖాస్తు గడువు పొడిగించాలన్నారు.

నిరాశ్రయుల నేస్తం ఏయూటీడీ

- అభాగ్యుల బాగోగులే లక్ష్యంగా చర్యలు
- దేశవ్యాప్తంగా ఎన్నో ఇళ్లల్లో వెలుగులు నింపిన సంస్థ


టీఎస్ఆర్ కాంప్లెక్స్ పురుషుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులు

అల్లిపురం: అనాథలు, నిరాశ్రయులు, మానసిక వికలాంగులు, వృద్ధులకు అండగా నిలిచి ఆశ్రయం ఇప్పిస్తోంది ఏయూటీడీ సంస్థ. ఉండటానికి ఇళ్లు, కట్టుకోవడానికి సరైన దుస్తులు లేక రోడ్లపై తిరిగే వారికోసం జీవీఎంసీ సహాయంతో ఏయూటీడీ సంస్థ నగరంలో పలుచోట్ల వసతి గృహాలు నిర్వహిస్తోంది. వీటిలో ఆహారం, చికిత్స అందిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా వేలాది మందికి ఆశ్రయం కల్పించడంతోపాటు మానసిక వికలాంగులకు ప్రత్యేకంగా చికిత్స అందించి, పూణేకు చెందిన శ్రద్ధా ఫౌండేషన్ సాయంతో వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చుతోంది. వారి మోముల్లో ఆనందాన్ని నింపుతోంది.

మానసిక వికలాంగులకు మనోధైర్యం

దేశంలోని పలు ప్రాంతాల నుంచి మానసిక వికలాంగులు రైళ్లలో వచ్చి నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో సంచరిస్తుంటారు. రోడ్డు పక్కన దీనస్థితిలో మలమూత్రాలతో తడిసిపోయి, చూసిన వారికి రోత పుట్టించేలా తిరుగాడుతుంటారు. అలాంటి వారి సమాచారాన్ని కొంత మంది జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి అందిస్తుంటారు. సమాచారం తెలుసుకున్న సిబ్బంది ఆ అభాగ్యుల వద్దకు చేరుకుని అక్కడికక్కడ సపర్యలు చేసి, దుస్తులు మార్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఈ క్రమంలో గతంలో సుప్రీంకోర్టు న్యాయవాది ఒకరిని బీచ్‌రోడ్డులో సంస్థ ప్రతినిధులు సంరక్షించి చికిత్స అందజేశారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమెను తీసుకెళ్లారు. పూణేకు చెందిన శ్రద్ధ ఫౌండేషన్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్కు సాయంతో వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది.


టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో జీవీఎంసీ ఏయూటీడీ మహిళ, పురుషుల వసతి గృహం

అద్దంకిగా మానసిక ఆస్పత్రి నిబంధనలు

గతంలో మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్, సిబ్బంది సహకారంతో మానసిక వికలాంగులకు చికిత్స అందజేసేవారు. వారికి సరైన చికిత్స అందజేయడంతో కోలుకున్న తర్వాత ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహాలు టీఎస్ఆర్ కాంప్లెక్స్, భీమ్‌నగర్‌లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఆశ్రయం కల్పించేవారు. వారి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించేవారు. ప్రస్తుతం ఉన్న సూపరింటెండెంట్ నేరుగా మానసిక వికలాంగులను ఆస్పత్రిలో చేర్చుకోమని, రివ్యూ బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సిఫార్సు చేశామని, బోర్డులో సభ్యులు సిఫార్సు చేస్తేనే తీసుకుంటామని చెబుతున్నారని ఏయుటీడీ ప్రతినిధి ప్రగడ వాసు తెలిపారు. పాత పద్ధతిలోనే రోగులను చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండేళ్లుగా ఆశ్రయం కల్పించారు


నాది శ్రీకాకుళం. నాకు నా అన్నవారు ఎవరూ లేరు. ప్రమాదంలో కుడికాలు పోగొట్టుకున్నా. గత రెండు సంవత్సరాలుగా జీవీఎంసీ, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. అన్ని రకాల వసతులు అందుతున్నాయి.

– జి.రామారావు, టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఆశ్రయం పొందిన వ్యక్తి

కుటుంబాన్ని కోల్పోయా


నేను మానసిక వ్యాధితో కుటుంబాన్ని కోల్పోయాను. దిక్కు తోచకుండా కాకినాడ నుంచి విశాఖపట్నం చేరుకున్నా. నన్ను ఏయుటీడీ సిబ్బంది అక్కున చేర్చుకుని చికిత్స అందజేశారు. ఇప్పుడు నా ఆరోగ్యం బాగుపడింది.

– మంగ, కాకినాడ, టీఎస్ఆర్ షెల్టర్

215 మంది రికవరీ


2013 నుంచి ఇప్పటి వరకు 215 మందిని రికవరీ చేశాం. వారిలో 49 మంది మహిళలు, 140 మంది పురుషులను పూణేలోని శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా సొంత కుటుంబాల చెంతకు చేర్చగలిగాం. మానసిక ఆస్పత్రిలో రోగులను చేర్చుకునే విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

– ప్రగడ వాసు, ఏయుటీడీ కార్యదర్శి

క్లుప్తంగా

నేడు కశింకోటలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కశింకోట: కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు 4వ సచివాలయానికి సంబంధించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్యులు, పీహెచ్‌సీల వైద్యులు హాజరై రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 4వ సచివాలయ పరిధి ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం నేడు

అనకాపల్లిటౌన్: మండలంలో రూ.కోటీ 14 లక్షల నిధులతో అభివృద్ధి చేసిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవాలు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవాలు జరగనున్నట్లు వెల్లడించారు. వెంకుపాలెం గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే), కుంచంగి గ్రామంలో రూ.25 లక్షలతో పూర్తి చేసిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.20.80 లక్షల నిధులతో పూర్తిచేసిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ఆయా ప్రాంతాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాట వేస్తున్న సర్పంచ్ నాగమణి

పరవాడ: పెదముషిడివాడలో దుర్గాదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సర్పంచ్ పల్లా నాగమణి చెప్పారు. ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం పందిరిరాట వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ కలవలపల్లి సత్యనారాయణ, బొండా అరుణ, బలిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 1,318 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,230	4,430
రెండో రకం	4,130	4,220
మూడోరకం	3,800	4,100

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
మంత్ ఆఫ్ మధు	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్స్‌ర్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–12 యూనిట్లు, బీ పాజిటివ్–11 యూనిట్లు, ఓ పాజిటివ్–13 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రజలందరి ఆరోగ్యమే సీఎం జగన్ ధ్యేయం

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన
- నిపుణులైన వైద్యులతో వైద్య సేవలు, ఉచితంగా మందులు
- తుమ్మపాల, చింతలపాలెం వైద్య శిబిరాల్లో 946 మందికి వైద్య సేవలు


తుమ్మపాలలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు


తుమ్మపాల వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు


తుమ్మపాల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నిరీక్షిస్తున్న ప్రజలు

అనకాపల్లి రూరల్: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తుమ్మపాల ఎంపీడీవో కె.వి.నరసింహారావు, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. స్పెషలిస్టు డాక్టర్లు ఎం.ఏసు ప్రసాద్, యశస్విని, వాణీజగదీశ్వరి, రమ, శ్రావ్య వివిధ సమస్యలపై వచ్చిన 599 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం 33 మందిని ఉన్నత ఆస్పత్రులకు రిఫర్ చేశారు. 175 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 110 మందికి కళ్ల జోళ్లు అవసరమని, 18 మందికి కేటరాక్ట్ సర్జరీ చేసేందుకు నిర్ధారించారు. 155 మందికి సుగర్, బీపీ, 61 మందికి హెచ్‌బీ పరీక్షలు చేశారు. నోడల్ అధికారి డాక్టర్ జ్యోతి శిబిరాన్ని పర్యవేక్షించారు. దీర్ఘకాలిక రోగులు, వయసు పైబడిన వారు అధిక సంఖ్యలో శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు తీసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార స్టాళ్లను ఏర్పాటు చేసి, శిబిరానికి వచ్చిన వారికి పోషకాహార ప్రయోజనాలను వివరించారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, ఎంపీటీసీలు వద్దాది భారతి, చదరం నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ చదరం చిన్న, స్థానిక నాయకులు పీలా బుజ్జి, పీలా విశ్వేశ్వరరావు, వెలగా మోదినాయుడు, కొణతాల చంటమ్మ, తర సత్యారావు, ముత్యాల వెంకటలక్ష్మి, కొయ్య జగదలక్ష్మి, కొయ్య భాస్కర్ పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని చింతలపాలెం సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 347 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 120 మంది కంటి సంబంధిత సమస్యలకు శిబిరంలో వైద్యుల్ని ఆశ్రయించారు. వీరిలో అవసరమైన 63 మందికి కళ్లద్దాలు, ఇద్దరికి శస్త్ర చికిత్సలు చేయాలని సిఫార్సు చేశారు. 96 మందికి బీపీ, 47 మందికి సుగర్, ఇతర పరీక్షలు చేశారు. ముందుగా శిబిరాన్ని, ఇతర విభాగాలను వరుసగా ఎంపీడీవో వి.వి.రవికుమార్, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యుడు యు.రమేష్, సర్పంచ్ కొట్టి రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక వైద్యులు రవితేజ, భానుప్రియ, దీపక్, యశోద హాజరై రోగులను పరీక్షించి అవసరమైన వారికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. కంటి పరీక్షల విభాగానికి ఎక్కువ మంది హాజరయ్యారు. శంకర్ ఫౌండేషన్ సిబ్బంది వచ్చి సేవలందించారు. ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకు వచ్చి వైద్య సేవలు పొందారు. శిబిరానికి చింతలపాలెంతోపాటు సచివాలయ పరిధిలోని గొబ్బూరు గ్రామం నుంచి ప్రజలు వచ్చి బారులు తీరారు. పౌష్టికాహారంపై అవగాహన కలిగిస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పలు పౌష్టిక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ కె.నరసింగరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.ప్రసాద్, ఎంఈవో మూర్తి, ఏపీవో శివ తదితరులు పాల్గొన్నారు.


రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, ప్రజా ప్రతినిధులు


తుమ్మపాల శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్


ఈసీజీ తీస్తున్న సిబ్బంది

బిడ్డకు జ్వరం



వీడు నా కుమారుడు ధనుష్. జ్వరంతో బాధపడుతున్నాడు. ఊర్లోనే పెద్ద పెద్ద డాక్టర్లు వచ్చి, వైద్యం చేస్తున్నారని తెలిసింది. అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్‌కి చూపించుకునేందుకు బిడ్డను తీసుకొచ్చాను. పిల్లాడికి తనిఖీ చేశారు. మందులు కూడా ఉచితంగా అందించారు. ఆనందంగా ఉంది.

–భీముని జయలక్ష్మి, తల్లి, చింతలపాలెం

దూరంగా ఉన్నవి కనిపించట్లేదు



దూరంగా ఉన్న వస్తువులు సరిగా కనిపించట్లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కళ్ల డాక్టర్‌కు చూపించుకున్నాను. మిషన్‌తో కళ్లు పరీక్షించారు. కళ్లకు ఆపరేషన్ చేయాలన్నారు. వాళ్లే ఉచితంగా చేస్తామన్నారు. పిల్లలతో మాట్లాడి ఆపరేషన్‌కు తయారవ్వాలి. దీంతో ప్రస్తుతానికి మందులు ఇచ్చారు. వీలైనంత వేగంగా ఆపరేషన్ చేయించుకుంటా.

–బళ్లా దేవుడమ్మ, చింతలపాలెం

నాలుగేళ్లొచ్చినా నడక, మాట లేదు



మా మనుమడు జ్యోతీష్‌కు నాలుగేళ్లొచ్చిన నడక రాలేదు. మాట్లాడటం లేదు. ఎన్నో ఆస్పత్రులు తిప్పాం. స్కానింగ్, పరీక్షలు చేయించాం. ప్రయోజనం కనిపించట్లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి పెద్దపెద్ద డాక్టర్లు వస్తున్నారని తెలిసింది. అందుకే ఇక్కడ కూడా పిల్లాడిని చూపిద్దామని తీసుకొచ్చాను. పరీక్షలు చేశారు. మందులిచ్చారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ చేయిస్తే సర్దుకుంటుందన్నారు.

–సోమిరెడ్డి రమణమ్మ, చింతలపాలెం


రోగులకు కేస్ షీట్‌లు అందిస్తున్న సిబ్బంది


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


రోగ లక్షణాలు తెలుసుకుంటున్న డాక్టర్ యశోద


మందుల పంపిణీ

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

కశింకోట: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం సామాజిక తనిఖీ ప్రారంభమైంది. మొదటి విడతగా 8 గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. శాట్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన జిల్లా రిసోర్స్ పర్సన్లు, విలేజ్ సోషల్ ఆడిటర్లు 8 బృందాలుగా ఏర్పడి తీడ, ఉగ్గినపాలెం, జి.భీమవరం, సుందరయ్యపేట, కశింకోట, సోమవరం, ఏఎస్ పేట, అడ్డాం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనుల పరిశీలన జరిపారు. మూడు రోజులపాటు ఒక్కొక్క గ్రామంలో పనులను, రికార్డులను కూలంకషంగా తనిఖీలు చేయనున్నారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి తమ పరిశీలనలో వెల్లడైన లోటుపాట్లు, అవకతవకలను సభ ముందుంచనున్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఇదే విధంగా విడతల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. ఈ తనిఖీలను రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పర్యవేక్షిస్తున్నారు. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.9.96 కోట్లతో 1,454 పనులు చేపట్టినట్లు ఏపీవో శివ తెలిపారు. వీటిలో రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీల భవన నిర్మాణంతోపాటు చెరువులు, బావులు, కాలువల తవ్వకం తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ అనంతరం మండల స్థాయిలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు.


శారదానది అవతల పొలాల్లో సాగు నీటి కాలువ తవ్వకంపై సామాజిక తనిఖీలో సిబ్బంది

గొర్రెలు, మేకల సంతకు దసరా కళ

- స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంత సోమవారం కళకళలాడింది. చాలా రోజుల తర్వాత గొర్రెలు, మేకల్ని అధిక సంఖ్యలో విక్రయానికి తీసుకొచ్చారు. విజయ దశమి సమీపిస్తుండటంతో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు తూర్పు గోదావరి జిల్లా నుంచి పెంపకందారులు, వ్యాపారులు అమ్మకానికి తీసుకు వచ్చారు. ఇప్పటి వరకు 500 వరకు ప్రతి వారం అమ్మకానికి వచ్చేవి. ఈ వారం రెట్టింపు అయ్యాయి. దీంతో సంతలో సందడి నెలకొంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వీటిని కొనుక్కున్నారు. పరిమాణం ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.25 వేలు వరకు ధర పలికింది. విశాఖ, గాజువాక, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి హోటళ్ల నిర్వాహకులు, కొనుగోలుదారులు, వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి వ్యాన్లలో తరలించుకుపోయారు. అయితే ధర ఆశించినంతగా రాలేదని, దశమి ముందు ఉండటంతో వచ్చే వారం ఎక్కువ ధర లభించగలదని నర్సీపట్నానికి చెందిన గొర్రెల వ్యాపారి ముసిలినాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు ఆశించిన ధర రాకపోవడంతో జీవాలను వ్యాన్లలో తిరిగి తమ ప్రాంతాలకు తీసుకుపోయారు. కూరగాయల ధరలు స్వల్పంగా పెరిగాయి. కిలో టమాటా రూ.20 నుంచి రూ.25, బంగాళాదుంప రూ.30, ఉల్లిపాయలు రూ.40, బెండకాయలు, దొండకాయలు, బీట్రూట్, క్యారెట్, బీరకాయ, చేమదుంప రూ.60, క్యాప్సికం, ఆగాకర రూ.100కు అమ్మకాలు సాగాయి.


వ్యాన్‌లో గొర్రెలు, మేకల తరలింపు

ఎన్టీఆర్ వైద్యాలయంలో ట్రైనీ కలెక్టర్

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో హేమంత్‌తో కలిసి ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు తీసుకెళ్లేందుకు తయారు చేయించిన సంచులను ఆయనకు డీఎంహెచ్‌వో చూపించారు. సంచుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనీ కలెక్టర్ వెంట వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్షలో మందులు తీసుకెళ్లే సంచుల్ని చూస్తున్న ట్రైనీ కలెక్టర్, డీఎంహెచ్‌వో

లక్ష్యంతో సాధన చేస్తే రాణింపు


కోచ్ నాగార్జునను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

సబ్బవరం: నిర్దిష్ట లక్ష్యంతో తగిన సాధన చేస్తే క్రీడా రంగంలో రాణించవచ్చని ఆర్మీ ఇంటర్నేషనల్ అథ్లెటిక్ కోచ్ పల్ల నాగార్జున అన్నారు. సబ్బవరంలోని రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అకాడమీలో శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో రాణించడానికి ఎలా సాధన చేయాలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ, డైరెక్టర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నేడు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి శ్రీ చింతామణి గణపతి దత్తక్షేత్రంలో మంగళవారం ఉదయం 9 గంటలకు సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఆంజనేయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఉదయం 7 గంటలకు కార్యసిద్ధి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాత్రికేయుల ఆందోళన


ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లిటౌన్: రైతులు, ప్రజాసమస్యలపై కథనాలను కేంద్రం జీర్ణించుకోలేకనే ఢిల్లీ న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను అరెస్టు చేయించిందని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా గౌరవాధ్యక్షుడు జి.కాంతారావు ఆరోపించారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్‌లో సోమవారం రాత్రి జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చేపట్టిన ఉద్యమాలు, ప్రజా సమస్యలపై కథనాలు రాసిన న్యూస్‌క్లిక్ ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించడం ఆక్షేపణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి వెంకటేష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బి.కొండలరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ రాట మహోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక నర్సింగరావుపేట మెహర్ బాబావీధిలో శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని సోమవారం అమ్మవారి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 150 మంది ముత్తయిదువులు హాజరై, రాటకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ముత్తయిదువులకు రవిక, గాజులు, పసుపు, కుంకుమలు అందించారు.

ఆలయ ఆవరణలో సిమెంట్ బెంచీలు


సిమెంట్ బెంచీలు ఇచ్చిన దాతతో చైర్మన్ నాయుడు

అనకాపల్లిటౌన్: దేవీ నవరాత్రులు, కార్తీక మాసం మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణ స్వామి దేవాలయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నట్లు దేవాలయాల చైర్మన్ కె.ఎం.నాయుడు తెలిపారు. దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసేందుకు వీలుగా పూసర్ల అప్పలనర్సమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త పూసర్ల కృష్ణ రెండు సిమెంట్ బెంచీలను సోమవారం అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు తమవంతు సహాయం చేయాలని కోరారు. దాతల సహాయంతో ఆలయం చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ప్రహరీ పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ, ధర్మకర్తలు మారిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది శంకరరావు, పూసర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టుకు చర్యలు తీసుకోండి


విల్లూరి పైడారావు

అనకాపల్లిటౌన్: జిల్లా ప్రధాన కేంద్రమైన అనకాపల్లి రైల్వే స్టేషన్లో సూపర్‌ఫాస్టు రైళ్లకు హాల్టులను కల్పించి, ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీ సత్యవతి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు కోరారు. గవరపాలెంలోని తమ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి, చోడవరం, మునగపాక, రాంబిల్లి, యలమంచిలి, మాడుగుల, నర్సీపట్నం, అచ్యుతాపురం మండలాలకు చెందిన ప్రయాణికులు రైళ్ల ప్రయాణానికి అనకాపల్లి స్టేషనే ప్రధాన ఆధారమన్నారు. అయితే అనకాపల్లిలో సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టులు లేకపోవడంతో విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్లవలసి వస్తోందన్నారు. అనకాపల్లి స్టేషన్లో విశాఖ ఎల్‌టీటీ(18519), కోరమాండల్(12841), ఫలక్‌నామా(12703), బీబీఎస్ ఎస్‌ఎంవీబీ(12845), అమరావతి(18047), ఎస్‌ఆర్‌సిటీ డీటీవై(22855) వందేభారత్(20833), వీఎస్‌కేపీఎల్ఎన్(18567), వీఎస్‌కేపీ ఐఎంబీ(20803), స్వర్ణ జయంతి(12803) సూపర్‌ఫాస్టు రైళ్లకు హాల్టు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సావిత్రిబాయి పూలే ట్రస్టు సేవలు అభినందనీయం


ఉమామహేశ్వరిని అభినందిస్తున్న సుభాషిణి

అనకాపల్లిటౌన్: సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని జిల్లా ఖజానా అధికారి(డీటీవో) వి.ఎల్.సుభాషిణి అన్నారు. స్థానిక సుంకరమెట్ట కూడలి యల్లపు ఉమామహేశ్వరి గృహావరణలో సోమవారం రాత్రి శరీర, అవయవ దాతల సంఘం వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరణించినా.. జీవించండి అనే నినాదాన్ని అందిపుచ్చుకుని అవయదానానికి ముందుకు వచ్చినవారిని కొనియాడారు. కొప్పాక గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక హోం నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించిన ఉమామహేశ్వరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ జి.సీతామహాలక్ష్మి, ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ కె.బాబూరావు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి వితరణ


రెడ్డీస్ లేబరేటరీ పంపిణీ చేసిన స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలతో విద్యార్థులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో రెడ్డీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో నంది ఫౌండేషన్ సహకారంతో ఎంపిక చేసిన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు తదితర స్టేషనరీ సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నతంగా స్థిరపడాలని అభిలషించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.